




ఈకేవైసీ పూర్తయ్యేనా?

- ఈ నెల 31తో ముగియనున్న గడువు
- ఇప్పటి వరకు 71.46 శాతం పూర్తి
- ఆధార్ కేంద్రాల వద్ద భారీగా జనాలు
- గడువులోగా పూర్తి చేసుకోకపోతే రేషన్ కట్?

వరంగల్ సిటీ, జనవరి 24 : రేషన్ షాపుల్లో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) జిల్లాలో పూర్తి కావడం ప్రహసనంలా మారేలా ఉంది. జిల్లాలోని 13 మండలాల్లో 2,66,679 రేషన్ కార్డులు ఉండగా, 7,87,991 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 5,63,078 మంది (71.46 శాతం) మాత్రమే ఈకేవైసీ పూర్తి చేయగలిగారు. మిగతా వారు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ నెల 31తో రేషన్ కార్డులకు ఈకేవైసీ గడువు ముగియనుంది. దీంతో జిల్లాలోని రేషన్ లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతుండటంతో ఆధార్ అప్‌డేట్ ఆలస్యం అవుతుందని వాపోతున్నారు. గడువు ముగిసే వరకు ఈకేవైసీ పూర్తి చేసుకోకపోతే రేషన్ కట్ అవుతుందనే ప్రచారంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈకేవైసీ పూర్తి చేయడం కోసం రేషన్ లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా పౌర సరఫరాల అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా స్పందిస్తున్నారు. వివిధ సాంకేతిక కారణాలతో ఆధార్ అప్‌డేట్ కావడం లేదని, అందువల్లనే ఈకేవైసీ సకాలంలో లబ్ధిదారులు పూర్తి చేసుకోలేక పోతున్నారన్నారు.

ఆధార్ అప్‌డేట్‌లో అన్నీ సమస్యలే..

రేషన్ కార్డు ఈకేవైసీ పూర్తి కావాలంటే ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సిందే. అయితే ఆధార్ అప్‌డేట్‌లో అనేక రకాలైన ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది ఆధార్ నెంబర్లు సరిపోలడం లేదు. మరికొందరి వేలి ముద్రలు, ఐరీస్ తదితర వివరాల నమోదులోను ఇబ్బందులు వస్తున్నాయి. చిరునామా, పుట్టిన తేదీ మార్పుల్లోనూ ఆధార్ సాధారణంగా అప్‌డేట్ అవడం లేదు. కొంత మందికి ఆధార్‌కు ఫోన్ నెంబర్లు లింక్ కావడం లేదు. దీంతో ఆధార్ అప్‌డేట్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొత్తగా పెళ్లైన వారి ఇంటి పేర్లు, ఇంటి నెంబర్లు తదితర వివరాలు నమోదు చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జనాలతో నిండిపోతున్న కేంద్రాలు

వరంగల్ జిల్లాలో 13 మండలాలు ఉండగా మండలానికో ఆధార్ కేంద్రం ఉంది. రేషన్ కార్డు ఈకేవైసీతో పాటు ఇతరత్ర ప్రభుత్వ పథకాలకు, కార్యక్రమాలకు ఆధార్ అనుసంధానం కచ్చితమవడంతో ఆధార్ కేంద్రాల వద్ద పెద్ద మొత్తంలో ప్రజలు గుమిగూడుతున్నారు. దీంతో కేంద్రాలన్నీ ఆధార్ అప్‌డేట్ కోసం జనాలతో నిండిపోతున్నాయి. అయినా నిర్దేశిత సమయాల్లో ఆధార్ అప్‌డేట్ కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

గడువులోగా పూర్తయ్యేనా..

జిల్లా పరిధిలో ఈ నెల 23వ తేదీ వరకు 71.46 శాతం మాత్రమే రేషన్ కార్డుల ఈకేవైసీ పూర్తయ్యింది. ఇంకా 28.54 శాతం ఈకేవైసీ పూర్తి కావాల్సి ఉంది. ఈ నెల 31తో రేషన్ కార్డుల ఈకేవైసీ గడువు ముగియనుండటంతో రేషన్ లబ్ధిదారులు ఆందోళనలో ఉన్నారు. సాంకేతిక కారణాలతో ఆధార్ అప్‌డేట్ కాకపోతే అది తప్పు ఎలా అవుతుందని, నిర్ధేశిత సమయంలో ఈకేవైసీ పూర్తి చేసుకోకపోతే రేషన్ కార్డులో పేరు తీసేస్తారనే ప్రచారంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, రేషన్ డీలర్లు సరైన అవగాహన కల్పించకపోవడంతో పాటు ఆధార్ కేంద్రాల్లో వివిధ సాంకేతిక కారణాలతో ఆధార్ కార్డులు అప్‌డేట్ కాకపోవడంతోనే తాము ఈకేవైసీ పూర్తి చేసుకోలేక పోతున్నట్లు పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు.



వరంగల్ చార్‌బౌళిలోని ఆధార్ కేంద్రంలో ఆధార్ అప్‌డేట్ కోసం వేచివున్న ప్రజలు

అధికారగణం వైఫల్యం

రేషన్ కార్డులకు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించడంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు స్థానిక రేషన్ డీలర్లు పూర్తిగా వైఫల్యం చెందినట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడైనా ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చునని, దానికి నిర్ణీత గడువేమి లేదని చెప్పుకుంటూ వచ్చిన అధికారులు అకస్మాత్తుగా ఈ నెల 31తో ఈకేవైసీ పూర్తి చేసుకోకపోతే రేషన్ కార్డు రద్దవుతుందనడం సరికాదంటున్నారు. మొదటి నుంచి అవగాహన కల్పించాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించి ఇప్పుడు కార్డులు రద్దు చేస్తాననడం అధికారులకు తగదన్నారు. ఈకేవైసీకి నిర్ణీత గడువు లేకుండా అందరివి పూర్తయ్యే వరకు ఆధార్ అప్‌డేట్‌లు చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఈకేవైసీకి గడువు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం గడువును పొడిగిస్తుందనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కేంద్రాల్లో అనేక సాంకేతిక కారణాలతో చాలా మంది లబ్ధిదారుల ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో వారి ఈకేవైసీ పూర్తి చేసుకోలేక పోతున్నారని ప్రభుత్వానికి నివేదికలు పంపించినట్లు వారు పేర్కొంటున్నారు.

మండలాల వారిగా ఈకేవైసీ వివరాలు

మండలం	రేషన్ కార్డులు	లబ్ధిదారులు	ఈకేవైసీ	శాతం
చెన్నారావుపేట	13,044	37,110	27,126	73.10
దుగ్గొండి	14,898	40,862	29,930	73.25
గీసుగొండ	18,456	51,664	39,620	76.69
ఖానాపూర్	10,263	30,315	21,160	69.80
నల్లబెల్లి	11,429	34,389	25,209	73.31
నర్సంపేట	22,325	64,315	48,481	75.38
నెక్కొండ	17,241	48,068	33,586	69.87
పర్వతగిరి	15,003	43,968	32,183	73.20
రాయపర్తి	16,469	51,909	35,345	68.10
సంగెం	14,824	43,224	32,751	75.77
వర్ధన్నపేట	15,136	43,885	30,433	69.35
వరంగల్	49,905	1,54,401	1,04,349	67.58
ఖిలావరంగల్	47,686	1,43,881	1,02,901	71.52
	2,66,679	7,87,991	5,63,078	71.46



ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

ఏనుమాముల మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- రూ.20,200 ధర పలికిన తేజ రకం

వరంగల్‌టౌన్, జనవరి 24: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బుధవారం ఎర్ర బంగారం(మిర్చి)తో ఎరుపెక్కింది. సుమారు 40వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో ఇంత పెద్ద ఎత్తున అమ్మకానికి రావడం ఇదే ప్రథమం. తేజ రకం మిర్చికి రూ.20.200 గరిష్ట ధర పలికింది. అలాగే 341 మిర్చి రకానికి రూ.16.800, వండర్‌హాట్‌కు రూ.19వేలు, 5531 రకం మిర్చికి రూ.14వేల ధరలు పలికాయి. కాగా, మంగళవారంతో పోలిస్తే తేజ రకం మిర్చికి క్వింటాల్‌కురూ.200 తగ్గింది. అదే విధంగా పత్తికి క్వింటాల్‌కు రూ.6,605 పలికింది. మక్కలు రూ.2,440, పచ్చి పల్లికాయ రూ.5వేలు, సూక పల్లికాయకు రూ.6,810 ధర పలికింది.

ఇదిలావుండగా, 26న గణతంత్ర దినోత్సవం, 27న శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవుదినం మూలంగా మార్కెట్ మూసి ఉంటుందని ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య తెలిపారు.

నైపుణ్య శిక్షణతో అభివృద్ధి చెందాలి

- ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఉషాదయాల్
- శిక్షణ పొందిన మహిళలకు కేవీకేలో సరిఫికెట్లు అందజేత

మామునూరు, జనవరి 24 : మహిళలు నైపుణ్య శిక్షణతో ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఉషాదయాల్ అన్నారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గ్రామీణ మహిళలకు నైపుణ్య శిక్షణలో భాగంగా కుట్టు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో మహిళలకు హ్యాండ్ బ్యాగులు, సెల్‌ఫోన్ పౌచ్‌లు, చేతి తొడుగులు తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. నల్లబెల్లి గ్రామంలో వారం రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని పూర్తి చేసుకొని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ఉషాదయాల్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ప్లాస్టిక్ బ్యాగుల నివారణతో క్లాత్ బ్యాగులు ఎంతగానో వాడుకలోకి వచ్చాని చెప్పారు. క్లాత్‌తో వాడే వస్తువులకు భవిష్యత్‌లో మంచి డిమాండ్ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్‌జ్యోతి, వ్యవసాయ సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, మహిళలు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉషాదయాల్

అగ్రంపహాడ్ జాతరకు భారీ బందోబస్తు

- భక్తుల రాకపోకలు, దర్శనానికి పకడ్బందీ ఏర్పాట్లు
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

ఆత్మకూరు, జనవరి 24 : మినీ మేడారంగా ప్రసిద్ధి పొందిన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ జాతర ప్రదేశాన్ని సీపీ పరిశీలించారు. రూట్ మ్యాప్‌ను, జాతరకు వచ్చే రహదారులను సీపీ పరిశీలించారు. వాహనాల పార్కింగ్ కోసం నాలుగు దారులకు నాలుగు ప్రదేశాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేక క్యూలైన్, ధర్మదర్శన క్యూలైన్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ కంట్రోల్ రూం, సీసీ కెమెరాల ఏర్పాటు కేంద్రం, పోలీస్ సిబ్బంది వసతుల సౌకర్యాలను ఎండోమెంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



జాతర ప్రాంగణంలో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ

అనంతరం గూడెప్పాడ్ క్రాస్ వద్ద పోలీస్ చెకింగ్ పాయింట్‌ను సందర్శించారు. అలాగే ఆత్మకూరు మోడ్రన్ పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను, చుట్టూ పరిసరాలను పరిశీలించి, స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పోలీసులకు సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు సీపీకి అధికారులు, పూజారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గద్దెల వద్ద సీపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎయిర్‌పోర్ట్ స్థాయిలో కాజీపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి

- రూ.20కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం..
- దక్షిణ మధ్య రైల్వే జీఎం అనిల్‌కుమార్ జైన్
- రైల్వే పాలీక్లినిక్ అప్ గ్రేడెడ్ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రైల్వే జీఎం అనిల్‌కుమార్ జైన్

కాజీపేట, జనవరి 24: కాజీపేట రైల్వే స్టేషన్‌ను ఎయిర్‌పోర్టు స్థాయిలో అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ జైన్ తెలిపారు. కాజీపేటలో బుధవారం రైల్వే పాలీక్లినిక్ అప్‌గ్రేడెడ్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే ఆస్పత్రిలో ఐదు వేల మంది రైల్వే కార్మికులు, ఐదువేల మంది రిటైర్డు ఉద్యోగులు, వారి కుటుంబాలతో సహా సుమారు 20వేల మంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. అందుకోసం పాత భవనంతోపాటు నూతనంగా నిర్మించిన అప్‌గ్రేడ్ ఆస్పత్రి భవనం ప్రారంభించామన్నారు. ఈ ఆస్పత్రిలో మహిళలకు, పురుషులకు ప్రత్యేక వార్డులతో పాటు ఇతర అధునాతన మెడికల్ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కంటి వైద్యులను ఏర్పాటు చేస్తామని, అప్పటి వరకు మరో ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేసే విషయం చర్చిస్తున్నామన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి గతంలో కేటాయించిన ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించామని జీఎం పేర్కొన్నారు. మరో రూ.20కోట్లు నిధులు కేటాయించి ప్రత్యేక బుకింగ్ కౌంటర్లు, ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి తదితర పనులు చేపడుతున్నామన్నారు. కాజీపేట, కాజీపేట టౌన్‌స్టేషన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామన్నారు. అనంతరం పిట్‌లైన్‌లను, లోకోపైలెట్‌ల కార్యాలయాలను తనిఖీలు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. జీఎం వెంట డీఆర్‌ఎం భరతేశ్ కుమార్ జైన్, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, సీఎంఎస్ అనురాధ రెడ్డి, సీనియర్ డీఎంటీఆర్‌డీ వాసిమ్ పాషా, డీవోఎం సురేశ్‌రెడ్డితోపాటు అన్ని వింగ్‌ల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి..

రైల్వే కార్మికులకు ప్రత్యేక కంటి వైద్యుడిని ఏర్పాటు చేయాలని, సబ్ డివిజన్ స్థాయిలో ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ సౌకర్యం కల్పించాలని, రైల్వే జీఎంను కలిసి కార్మిక నాయకులు విన్నవించారు. రైల్వే జీఎంను కలిసిన వారిలో మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, తెలంగాణ రైల్వే ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, నాయకులు సదానందం, సీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస యాదవ్, జానీ, అక్బర్ తదితరులు ఉన్నారు.

కాగా, జీఎం అనిల్‌కుమార్ జైన్ బుధవారం కాజీపేట పర్యటన సమాచారాన్ని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ప్రొటోకాల్ అధికారులు సమాచారం ఇవ్వలేదని, ఇది సరికాదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అంకూస్ విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- ఆటో, ద్విచక్రవాహనం ఢీ
- నల్లగట్టు గుట్ట వద్ద ప్రమాదం



శివశంకర్



రజిత

హసన్‌పర్తి, జనవరి 24: ఆటో, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని గుండ్ల సింగారానికి చెందిన భూక్య రజిత (40)తో పాటు బంధువులైన కోమినేని దుర్గా, భూక్య అనిల్, బానోతు భారతి, భూక్య సాయిలు కలిసి ఆటోలో సోమవారం వేములవాడ దైవ దర్శనానికి వెళ్లారు. మంగళవారం రాత్రి వేములవాడ నుంచి తిరిగి హనుమకొండకు బయలుదేరారు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి చిట్యాల సంపత్, కాటం శివశంకర్(30) ద్విచక్ర వాహనంపై హసన్‌పర్తికి వస్తున్నా రు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో హసన్‌పర్తి నల్లగట్టు గుట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను బైక్ ఢీకొట్టింది. దీంతో ఆటోలో కూర్చున్న భూక్య రజిత రోడ్డుపై పడి పోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే అదే ఆటోలో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలిస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. రజితకు భర్త రాములు, కొడుకు, కూతురు ఉన్నారు. రాములు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, బైక్ పైనుంచి పడిపోయిన ఇద్దరిలో బైక్ వెనకాల కూర్చున్న శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న చిట్యాల సంపత్‌కు గాయాలయ్యాయి. మృతుడు శివశంకర్ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు భార్య రజిత, కుమారుడు ఉన్నారు. కాగా, ఆటోలో ఉన్న మిగతా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీగా మళ్లీ బరిలో ఉంటా..

- విజయం సాధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేని లోటు తీరుస్తా..
- రూ.3,268 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశా..
- వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్

హనుమకొండ టౌన్, జనవరి 24: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా మరోసారి బరిలో నిలుస్తానని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ స్పష్టం చేశారు. అన్నా.. అంటే నేనున్నా.. అంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తనవంతు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, బీఆర్ఎస్ అధిష్టానం తనకు అవకాశం ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండలోని హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దయాకర్ మాట్లాడారు.

రెండుసార్లు వరంగల్ నుంచి ఎంపీగా భారీ మెజారిటీతో విజయం సాధించిన తాను.. రూ.3268కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చానని పేర్కొన్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు రావడానికి, వరంగల్‌కు హృదయ్, అమృత్, స్మార్ట్‌సిటీలాంటి పథకాలు రావడానికి తనవంతు సహకారం అందించానని దయాకర్ వివరించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజల సహకారం భవిష్యత్‌లో కూడా ఉండాలని కోరారు. బీఆర్ఎస్ అధిష్టానం మరోసారి అవకాశం ఇస్తే వరంగల్ నుంచి విజయం సాధించి ఎమ్మెల్యేలు లేని లోటు తీరుస్తానని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ దయాకర్

పార్టీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఉండటంతో తాను బయటికి రాలేకపోయానని తెలిపారు. ప్రజల సమస్యలు వారు పరిష్కరించేవారని, తనస్థాయిలో చేయదగిన పనులు చేసేవాడినని చెప్పారు. తనకు డబ్బుమీద వ్యామోహం లేదని, ఎక్కడ కూడా పైసా అవినీతికి పాల్పడలేదన్నారు. అభివృద్ధి పనులకు నిధులు ఇచ్చే క్రమంలో కూడా కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకోలేదన్నారు. పలు సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో నేతలు రాజ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కె.వెంకటరమణ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 24: జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ హాజరు కాగా, సర్వేకు సంబంధించిన ఐఈసీ సామగ్రిని ఉద్యోగులకు అందించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టువ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతీ ఇంటికి వెళ్లి కుష్టువ్యాధికి సంబంధించిన లక్షణాలపై పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. లక్షణాలు ఉన్న వారిని ఆరోగ్య కేంద్రాలకు పంపి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారని చెప్పారు. కుష్టువ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రసీ అనే బ్యాక్టీరియా వలన వస్తుందని, ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుందని అన్నారు. ఈ వ్యాధి నెమ్మదిగా పెరిగి లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున 3 నుంచి 5 సంవత్సరాల వరకు పడుతుందని తెలిపారు. వయస్సు, లింగ భేదం లేకుండా ఎవరికైనా రావొచ్చన్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోటలో చారిత్రక ధగధగలు

సౌండ్ అండ్ లైట్ ప్రదర్శనలు పునఃప్రారంభం

ఖిలావరంగల్, జనవరి 24 : కాకతీయుల చారిత్రక వైభవాన్ని కళ్లకు కట్టే 'సౌండ్ అండ్ లైట్ షో' ప్రదర్శనలు వరంగల్ మధ్యకోటలో బుధవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. సాంకేతిక సమస్యలతో గత నెలరోజులుగా షోలు ఆగిపోయిన విషయం విదితమే. ప్రదర్శనలు లేకపోవడంతో దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు నిరాశకు లోనుకావడమే కాకుండా, చరిత్రను తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితిపై 'సౌండూ లేదు.. లైటూ లేదు..' అనే శీర్షికతో ఈ నెల 14న ఆంధ్రజ్యోతి జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ అధికారులు సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కీర్తి తోరణాల ప్రాంగణంలో సౌండ్ అండ్ లైట్ ప్రదర్శనలను తిరిగి ప్రారంభించారు.

ఇకనుంచి ప్రతీ రోజు సాయంత్రం రెండు సార్లు కోటలో సౌండ్ అండ్ లైట్ ప్రదర్శన ఉంటుందని ఇన్‌చార్జి గట్టికొప్పుల అజయ్ తెలిపారు. సాయంత్రం 6 నుంచి 6.50 వరకు మొదటి షో, 7 నుంచి 7.50 వరకు రెండో షో ఉంటుందని తెలిపారు. టికెట్ల ధర పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20గా నిర్దేశించినట్లు పేర్కొన్నారు.



వరంగల్ కోటలో సౌండ్ అండ్ లైట్ షో దృశ్యం





విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ పరీక్ష తేదీలు ఖరారు


నయీంనగర్, జనవరి 24: టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధి ఉమ్మడి వరంగల్ ఆపరేషన్ సర్కిల్‌లో జూనియర్ లైన్‌మెన్ నియామకం నోటిఫికేషన్ 2018వ సంవత్సరం జనవరి నెలలో విడుదలైంది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు 2024 ఫిబ్రవరి 1, 2వ తేదీలలో జూనియర్ లైన్‌మెన్ అర్హులైన అభ్యర్థులకు విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్ష, విద్య అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9గంటలకు ములుగురోడ్‌లోని నార్త్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)కి విధిగా హాజరుకాగలరని టీఎస్ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కే. వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తిని బెదిరించి గొలుసు, సెల్ అపహరణ

నయీంనగర్, జనవరి 24: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రానికి చెందిన డేగల అంజనేయ ప్రసాద్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి అతడి నుంచి బంగారు గొలుసు, మొబైల్‌ను సోమవారం సాయంత్రం అపహరించారు. సుబేదారి సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన డేగల అంజనేయ ప్రసాద్(55) అనే వ్యక్తి హనుమకొండ కిషన్‌పురలోని గీతాంజలి డిగ్రీ కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తాడు. ఈ క్రమంలో అంజనేయప్రసాద్ తన పని మీద ఖమ్మం వెళ్లి తిరిగి సోమవారం సాయంత్రం సుమారు 4గంటల ప్రాంతంలో హనుమకొండ బస్టాండ్‌కు వచ్చాడు. బాధితుడు తన ఇంటికి వెళ్లాలని ఆటోకోసం చూస్తుండగా ఆటో దొరకకపోవడంతో నడుచుకుంటూ ఏషియన్‌మాల్ మీదుగా వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో బెదిరించి తన మెడలో ఉన్న రూ.60,000 విలువ గల బంగారు గొలుసు, రూ.12,000 విలువ గల రెడ్‌మీ సెల్‌ను అపహరించినట్లు సీఐ తెలిపారు. బాధితుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ షూకూర్ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రతిభాపాటవ పరీక్ష


హనుమకొండ రూరల్, జనవరి 24: తెలంగాణ విద్యాశాఖ, సాంఘిక శాస్త్రఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సాంఘికశాస్త్రంలో ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 30వ తేదీలోపు పరీక్ష నిర్వహించి ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థుల వివరాలను పరీక్ష నిర్వాహకులు సోషల్‌ఫోరం బాధ్యులకు అందజేయాలన్నారు. ఈ పోటీలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషులో, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్ మధ్యమంలో మాత్రమే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షనిర్వహణకు సంబంధించి వివరాల కోసం జిల్లా సోషల్ ఫోరం బాధ్యులు అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి 98498 34110, సతీష్ ప్రకాష్ 97001 04075 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.















'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

» హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
» 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
» 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్య
కాంగ్రెస్‌కు ఓటేసినవారు బాధపడుతున్నారు
ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిలింది చిన్న దెబ్బే
తప్పుడు హామీలతో ప్రజల్ని నమ్మించిన రేవంత్
ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో..
ఓటుతో కొడతారో రైతులు ఆలోచించాలి
ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకం: కేటీఆర్

కరీంనగర్ టౌన్, జనవరి 24: తొందర్లోనే కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు కూడా అనుకోలేదని, అందుకే బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీగా ఇస్తామంటూ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన వారంతా ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్నదెబ్బ మాత్రమే తగిలిందన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతోనే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ అన్నారు. ప్రజల తీర్పును అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధాన మంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో్స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


» రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
» సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
» పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
» బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

» గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
» అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
» అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

» అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

బాలికలకు అండగా ప్రభుత్వం : ఎంపీపీ

సంగెం, జనవరి 24 : బాలికలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంపీపీ కందకట్ల కళావతి అన్నారు. సంగెం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను విద్యాలయ ప్రత్యేకాధికారి నీలిమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ బాలికల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో బాలికలు ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

కోటలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు



మధ్యకోటలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం

ఖిలావరంగల్, జనవరి 24: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలావరంగల్ కోటలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మధ్యకోటలోని ఖుష్ మహల్ గ్రౌండ్ ముస్తాబవుతోంది. ఈ నెల 26న గణతంత్ర వేడుకలకు గాను జిల్లా యంత్రాంగం పనులు చేపట్టారు. బుధవారం మధ్యకోటలోని గ్రౌండ్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కంకర చూర్ణం, ఎర్రమట్టి పోసి బారికేడ్లు, స్టేజీ, షామియానా, తాగునీరు, ముఖ్య అతిథులు, వీఐపీల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి సంఘం అధ్యక్షుడిగా అశోక్

గీసుగొండ, జనవరి 24: మండలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి పరపతి సంఘం అధ్యక్షుడిగా కడారి అశోక్(గంగదేవిపల్లి), కార్యదర్శిగా ఎండీ రఫీ(గరీబ్‌నగర్), ఉపాధ్యక్షుడిగా మీర్ షాకీర్(జాన్‌పాక), గజ్జెల్లి రవిందర్(గొర్రెకుంట), గౌరవ అధ్యక్షులుగా కుర్ర శ్రీనివాస్(వంచనగిరి), బిట్ల శివప్రసాద్(మనుగొండ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, సంఘం గత కొన్నేళ్లుగా సామాజిక, సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలను చేపడుతూ మన్ననలను పొందుతోంది.

పోషక విలువలపై విద్యార్థులు తెలుసుకోవాలి

▸▸ జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

గీసుగొండ, జనవరి 24: ఆహార పదార్థాలలో ఉన్నపోషక విలువలు, శరీరానికి వాటి ఉపయోగం గురించి విద్యార్థులు విధిగా తెలుసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. 15వ డివిజన్ ధర్మారం జడ్పీ పాఠశాలలో ఎనిమియా ముక్తిభారత్ కార్యక్రమాన్ని వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 8 నుంచి 12వ తరగతి విద్యార్థుల్లో రక్తహీనత నివారించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్రీయ బాలల స్వస్థ (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమం ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు అందిస్తున్నట్లు వివరించారు. హెచ్‌పీ డిజిటల్ మీటర్‌ల ద్వారా రక్తంలోని హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) శాతాన్ని నిర్ధారిస్తున్నట్లు చెప్పారు. సంతులిత ఆహారం తీసుకుంటే రక్తహీనతను నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ గోపాల్‌రావు, బీఆర్‌ఎస్‌కే డాక్టర్ నేహ, హెచ్‌ఎం సాంబయ్య, సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ రవిచంద్ర జన్మదిన వేడుకలు



పోచమ్మమైదాన్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పోచమ్మమైదాన్, జనవరి 24 : వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో బుధవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొలుగొడ్డు శ్రీనివాస్, బొల్లికొండ విజయలక్ష్మి, పాస్టర్ అరుణ్‌జేమ్స్, ఎంఎస్ రాజు, తాండ్ర భాస్కర్, జన్ను సుధాకర్, జన్ను జోసఫ్, జన్ను మల్లేశం, ఫక్రుద్దీన్, కిరణ్ కుమార్, మాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రవిచంద్ర వ్యక్తిగత సహాయకుడు వీణవంక కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ భద్రకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ప్రధాన అర్చకులు శేషు, నాగరాజుశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర యువసేన నాయకులు నాగపురి రమేష్‌గౌడ్, సిరిమల్ల కిరణ్, వినయ్, సింగారం సంతోష్, అరవింద్ యాదవ్, జనగాం మణికంఠ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను మోడల్‌గా తీర్చిదిద్దాలి

▸▸ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కలెక్టరేట్, జనవరి 24: జిల్లాలోని గ్రంథాలయాలను మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థల సర్వసభ్య సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 23వ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన నిధులు, వివరాలు 2024-25 సంవత్సరం బడ్జెట్ అంచనాలు ఆమోదం పంపుటకు సంబంధిత వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 గ్రంథాలయాల్లో రెండు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. గత సంవత్సరం ఇంకా మిగిలి ఉన్న నిధులతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గ్రంథాలయాల మరమ్మతులు, సీసీ కెమెరాలు, ప్రతీ గ్రంథాలయంలో ప్రజలకు విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు ఉంచాలన్నారు. ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రంథాలయాల నిర్వహణ విషయంలో లోటుపాట్లు జరగకుండా ఉన్న నిధులను సక్రమంగా వినియోగిస్తూ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, వయోజన విద్య ఉప సంచాలకులు రమేష్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి శశిజాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 24 : రిపబ్లిక్ డేను పురస్కరించుకొని బల్దియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యోగుల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం హనుమకొండ బల్దియా ప్రధాన కార్యాలయం సమీపంలోని ఇండోర్ స్టేడియంలో షటిల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చదరంగం తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఎఫ్‌వో శంకర్‌లింగం తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన సుందర్‌రాజ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 24 : వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్, కుడా వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషాను కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ కలిశారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన సుందర్‌రాజ్ గతంలో కుడా ఆధ్వర్యంలో చేపట్టిన పనుల గురించి చర్చించినట్లు తెలిసింది.

టీఎండబ్ల్యూఈయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 24 : జీడబ్ల్యూఎంసీ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్‌ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆవిష్కరించారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సింగారపు బాబు, రాష్ట్ర కార్యదర్శి జన్ను ప్రకాశ్, నాగెల్ల కుమారస్వామి, జలగం కుమార్, కొమ్ముదాసు, జన్ను ప్రతాప్, రుద్ర సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గీసుగొండ జాతర



స్వామి వారి కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

గీసుగొండ, జనవరి 24: గీసుగొండ మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి జాతర మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. గ్రామం లోని రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయం నుంచి రాత్రి ఉత్సవమూర్తులను కొండపైకి డప్పువాయిద్యాలతో భక్తులు పల్లకీలో తీసుకెళ్లారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి పాల్గొన్నారు. కాగా, బుధవారం భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. రెండు రోజుల పాటు స్థానిక గ్రామాల భక్తులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

జీడబ్ల్యూఎంసీ ఐఎన్‌టీయూసీ కమిటీ ఎన్నిక

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 24: వరంగల్ మహానగర పాలక సంస్థ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఐఎన్‌టీయూసీ నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, ఐఎన్‌టీయూసీ మునిసిపల్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లా రమేశ్, గౌరవ ముఖ్య సలహాదారులుగా కొమ్ము జ్ఞానేధర్, మహ్మద్ ఖాసీం, ఏకు సుధాకర్, అధ్యక్షుడిగా పాశం రవియాదవ్, ప్రధాన కార్యదర్శి డి.రమేశ్, కోశాధికారిగా ప్రవీణ్ తదితరులు ఎన్నికయ్యారు.

డాక్టర్ రాజును సన్మానించిన బార్ కౌన్సిల్ సభ్యులు

ఖిలావరంగల్, జనవరి 24 : ఇటీవల నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ మైదం రాజును బార్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. బుధవారం 18వ డివిజన్ లేబర్ కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాలలో డాక్టర్ రాజును శాలువా, బొకేతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు భైరపాక జయాకర్, వరంగల్ జిల్లా ట్రెజరర్ అమృతరావు, సీనియర్ న్యాయవాదులు మైదం జయపాల్, ఎల్లేష్‌నాయక్, ఎడ్ల ప్రభాకర్, తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వరంగల్ సిటీ, జనవరి 24 : భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునిల్ బన్సాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా నూతన అధ్యక్షుడిగా నియామకమైన రవికుమార్ బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సునిల్ బన్సాల్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.. ఈసందర్భంగా బన్సాల్ గంటకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిశారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

శంభునిపేట, జనవరి 24 : ఒత్తిడిలతో కొనసాగుతున్న జీవిత ప్రయాణంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శోభాదేవి అన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా 6 నుంచి 18 సంవత్సరాలు ఉన్న బాలబాలికలకు ప్రభుత్వం ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తుందన్నారు. విద్యార్థుల్లో పౌష్టికాహార లోపంతో విద్యపై ఏకాగ్రత చేయలేకపోతున్నారని తెలిపారు. ఈశిబిరంలో సుమారు 60 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సఫూర, ఫార్మాసిస్టు సుప్రజ, ఎన్ఎస్ఎస్ పీవో వీరాంజన్ కుమార్, రజిత, మల్లారెడ్డి, నరేష్, మమత, రూపారాణి, మహాలక్ష్మి, అనిల్, లక్ష్మి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని గ్రామాలుగా మరియపురం, గంగదేవిపల్లి



కార్యక్రమంలో నందినిని మెమొంటోతో సత్కరిస్తున్న డీడబ్ల్యువో శారద

గీసుగొండ, జనవరి 24: జాతీయ ఆదర్శ గ్రామాలైన మరియపురం, గంగదేవిపల్లి బాల్య వివాహాలు లేని గ్రామాలుగా జిల్లా సంక్షేమ శాఖ గుర్తించి సర్పంచ్‌లు, కార్యదర్శులను అవార్డులతో సత్కరించింది. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వరంగల్ కొత్తవాడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి, కార్యదర్శి స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, గంగదేవిపల్లి సర్పంచ్ గోనె మల్లారెడ్డి, కార్యదర్శి తపస్విని, కార్యదర్శి ఊర్మిళదేవిలను కలెక్టర్ ప్రావీణ్య సన్మానించారు. కార్యక్రమంలో డీడబ్ల్యువో శారద, డీఈవో వాసంతి, జీసీడీవో ఫ్లోరెన్సా తదితరులు పాల్గొన్నారు. అలాగే జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 16వ డివిజన్ గొర్రెకుంట హైస్కూల్ విద్యార్థిని బి.నందినికి జిల్లా ఉత్తమ క్రీడాకారిణిగా అవార్డు లభించింది. ఈ మేరకు నందినికి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి శారద మెమొంటోను అందించి అభినందించారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి, పాఠశాల హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీఈటీ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రజల పక్షమే

▸▸ వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

మామునూరు, జనవరి 24 : అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా... బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షమేనని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. వరంగల్ హంటర్ రోడ్డులోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం 43వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు అక్కెనపల్లి స్పందన్ ఆధ్వర్యంలో డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అరూరి మాట్లాడుతూ దురదృష్టవశాత్తు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడలేదని అన్నారు. ఎన్ని ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేసినా, నియోజకవర్గంలో అనేక రకాల అభివృద్ధి పనులు చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అబద్దపు హామీలతో ప్రజలను నమ్మించిందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ పోరాడుదామని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

గ్రేటర్ పరిధిలోని విలీన గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడానికి కుట్ర పన్నినట్లు అరూరి రమేష్ తెలిపారు. రోడ్డు, భవనాల వంటి ప్రజా ప్రయోజన మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులను రద్దు చేయవద్దని కోరారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎవ్వరు అధైర్య పడొద్దన్నారు. అన్ని వేళలా అందరికి అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయడమే ప్రధాన కర్తవ్యమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలో గులాబీజెండా ఎగురేలా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మేకల రాణి డానియల్, ఫాక్స్ డైరెక్టర్ షణ్ముఖరెడ్డి, జయశంకర్, క్రాంతి, జగపతి, రవి, సాంబయ్య, జమీర్, కిరణ్, జీవంతరెడ్డి, రాములు, భరత్, హనుమాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటను సందర్శించిన అధికారులు

ఖిలావరంగల్, జనవరి 24 : ఖిలావరంగల్ కోటను దక్షిణమధ్య రైల్వేశాఖ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం సందర్శించారు. మధ్యకోటలోని శిల్పాల ఆవరణలోని కాకతీయుల కాలం నాటి కట్టడాలు, శిల్ప సౌందర్యాన్ని తిలకించారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ కో-ఆర్డినేటర్ బాషా, ఖిలావరంగల్ ఇంచార్జి గట్టికొప్పుల అజయ్, దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులు ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే టీఎన్జీవోస్ ధ్యేయం

వరంగల్ కలెక్టరేట్, జనవరి 24 : జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వం పొందాలని, సంఘం బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమమే టీఎన్జీవోస్ ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ అన్నారు. వరంగల్ నగర సిటీ టీఎన్జీవోస్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంజీఎం ఆస్పత్రిలోని సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, హేమానాయక్, వంశీ, గద్దల రాజు, దుర్గారావు, పాలకుర్తి మధు, ఇంద్రసేనారెడ్డి, జ్యోతి, రామాదేవి, రవికుమార్, రవీందర్, నాగేశ్వర్ రావు, ప్రమీలావతి, తిరుమల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 24 : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం జీడబ్ల్యూఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. వడ్డెపల్లి విజయపాల్ కాలనీ, టీవీ టవర్, స్నేహనగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని సీపీ వెంకన్న స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయ స్థలం కాపాడాలి

శంభునిపేట, జనవరి 24: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని ఆ పార్టీ నాయకుడు కొంతం మోహన్ ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. రంగశాయిపేట పుల్లయ్యకుంట వద్ద గల ఉర్సు రెవెన్యూ శివారు సర్వే నెంబరు 140, 142లోని ఎకరం ప్రభుత్వ స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కేటాయించారు. ఆ స్థలంలో ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడం ఆక్రమణదారులు పలు నిర్మాణాలు చేపట్టారు. దీంతో పార్టీ నాయకులు స్పందించి రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

▸▸ జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి



'బేటీ బచావో - బేటీ పడావో' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

వరంగల్ సిటీ, జనవరి 24 : బాల్యం నుంచే ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని డీఈవో డి.వాసంతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సంబంధిత పోలీసు శాఖ, విద్య, ఆరోగ్య, పంచాయతీ, క్రీడల శాఖ సౌజన్యంతో వరంగల్ మట్టెవాడలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో బుధవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసంతి మాట్లాడుతూ... బాలికా సాధికారత, వారి హక్కుల కోసం సమయానుకూలంగా ఫిర్యాదు చేసేలా బాలికలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. లింగ వివక్షపై సమాజ ధోరణి, తల్లిదండ్రుల ఆలోచన సరళి మారితేనే సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. దేశంలో బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. జిల్లాలో బాల్య వివాహాలను రూపుమాపడానికి జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సమన్వయంతో తీసుకుంటున్న చర్యలను ఆమె కొనియాడారు.

జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.శారద మాట్లాడుతూ... సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ బాలురు, బాలికల మధ్య అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలికా సాధికారత, హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ బాలికల అభ్యున్నతికి జిల్లా సంక్షేమ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె సూచించారు. అనంతరం 'బేటీ బచావో - బేటీ పడావో' వాల్‌పోస్టర్‌ను అధికారులందరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో కల్పన, డీవైఎస్‌వో సత్యవాణి, డీఆర్‌డీవో డీపీఎం.భవాని, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పావని, సీడీపీవోలు, వివిధ విభాగాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గీసుగొండ, జనవరి 24: మండలంలోని జాన్‌పాక వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొని గాయపడిన గంద్రకోట భిక్షపతి(47) అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన భిక్షపతి పనికోసం ఈ నెల 19న కొమ్మాలకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. పని ముగించుకొని అదే రోజు ఇంటికి తిరిగి వెళ్తుండగా జాన్‌పాక వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయం కాగా స్థానికులు ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుమారుడు శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి

శంభునిపేట, జనవరి 24 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఏఐకేఎంఎస్ నాయకుడు రాచర్ల బాలరాజులు పిలుపునిచ్చారు. కేంద్రం విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్‌లోని రంగశాయిపేట జంక్షన్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26న సంయుక్త మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీఎం సెంటర్ వరకు చేపట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా భారత రైతు కూలీ సంఘం, కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, అక్బర్, కృష్ణ, హరిబాబు, కరుణాకర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 24 : ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహించే టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా సంఘం ప్రతినిధులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ... మహాసభల్లో ప్రొఫెసర్లు బుర్ర రమేష్, కాశీమ్, ఎ.నర్సింహారెడ్డి, వేణుగోపాల్, ప్రసాద్ తదితరులు ప్రసంగిస్తారన్నారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం టీపీటీఎఫ్ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్‌బాబు, రాష్ట్ర మాజీ కార్యదర్శి బెల్లంకొండ రమేష్, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు భైరి స్వామి, వివిధ జిల్లాల నాయకులు వెంకటేశ్వర్లు, మనోజ్, స్వామి, రవీందర్, లక్ష్మీపతి, మల్లయ్య, ప్రసాద్, వీరస్వామి, అశోక్, సారయ్య, సురేష్ గుప్త, చక్రునాయక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం పనుల్లో జాప్యం చేయొద్దు

▸▸ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అనిల్‌కుమార్

మేడారం, జనవరి 24 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణంలోని షెడ్డులో బుధవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో పురోగతి కనిపించడం లేదని అహనం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనుల్లో అలసత్వం చేయొద్దన్నారు. ప్రాకాహారం, సాలహారం పెయింటింగ్, లైటింగ్ పనులతోపాటు క్యూలైన్ల మరమ్మతులను 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గద్దెల వద్ద గ్రిల్స్ విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి ఫిబ్రవరి 10 వరకు పూర్తి చేయాలన్నారు. అలాగే మేడారం మహా జాతర అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో అంకిత్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

జోరుగా ముందస్తు మొక్కులు

వనదేవతలు సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్షల మందికి పైగా తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులు వనదేవతలను ముందస్తుగా దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. సమ్మక్క, సారలమ్మల నామాలను స్మరించుకుంటూ గద్దెలకు చేరుకున్నారు. అలాగే సమ్మక్క, సారలమ్మలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 25 జనవరి 2024

వరంగల్ రూరల్

ఘనంగా హిందూ ముస్లిం సమైక్యతా దినోత్సవ వేడుకలు

నర్సంపేట, జనవరి 24 : నర్సంపేట పట్టణంలోని ఆచార్య కళాశాలలో బుధవారం విద్యావేత్త గుంటిరాంచందర్, ముస్లిం నాయకుడు షేక్ జావిద్ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం సమైక్యతా దినోత్సవం సందర్భంగా జైహో, జైహో హిందూ, ముస్లిం ఏక్‌హో అంటూ జైహో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అష్ఫాఖుల్లా, బిస్మిల్, స్వామివివేకానంద, నేతాజీ, గాంధీ, గఫార్‌ఖాన్, తదితర మహనీయుల స్మృతిలోతెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారా ష్ట్రలో డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు హిందూ ముస్లిం సమైక్యతా దినాలుగా పాటించడం జరుగుతుందన్నారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్ మాట్లాడుతూ ముస్లిం, హిందూ ఐక్యతను సాధించి మతోన్మాదాన్ని దేశం నుంచి తరిమేద్దామన్నారు. సభ అనంతరం హిందూ, ముస్లిం ఐక్యత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంతరాతి మల్లేశం, సోల్తి సాయికుమార్, సంధాని, అర్షద్, షమేమ్, అంకూస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో స్వర్ణలత

వర్ధన్నపేట, జనవరి 24: రోడ్డు ప్రమాదాల నివారణలో లక్ష్యంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఆర్టీవో స్వర్ణలత తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో కరపత్రాలను వాహనదారులకు అందజేసి అవగాహన కల్పించారు. ప్రయాణం చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రయాణికులకు, వాహనదారులకు ఆమె వివరించారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక వ్యక్తి మరణం కాదని ఒక కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఓర్పు, సహనం, ఏకాగ్రత ఉండాలి

నర్సంపేట, జనవరి 24 : డ్రైవర్లకు ఓర్పు, సహనం, ఏకాగ్రత, సమయానుకూలత ఉండాలనని నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అన్నారు. డిపోఆవరణలో మంగళవారం డ్రైవర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్లకు గుర్తింపు ఉండాలన్న ఉద్దేశ్యంతో డ్రైవర్ డే వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ సంస్థకు డ్రైవర్ అనే వ్యక్తి కీలకమన్నారు. అనంతరం కండక్టర్లు, డ్రైవర్లకు గులాబీ పుష్పాలను అందించి డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలి

దుగ్గొండి, జనవరి24: విద్యార్థులు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసుకోవాలని రక్తశాతం గుర్తించి సరైన చికిత్సలు చేయించుకోవాలని నర్సంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ గుండా రవీందర్ సూచించారు. మండలంలోని గిర్నిబావిలోని జ్యోతిరావుపూలే విద్యాలయంలో బుధవారం ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 100 మంది విద్యార్థులకు హిమోమీటర్ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు రక్త పరీక్షలు చేసుకుని తగు చికిత్సలు చేసుకున్నట్లతే ఆటలలో, చదువులలో రాణించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో దుగ్గొండి వైద్యాధికారి కిరణ్‌రాజు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ సలోమి, పాఠశాల హెల్త్ సూపర్ వైజర్ శేఖర్, ప్రిన్సిపాల్ దేవేందర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నెక్కొండ, జనవరి 24 : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించినపుడే వారి భవిష్యత్ బంగారు భవిష్యత్ అవుతుందని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, విద్యోదయ పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి అన్నారు. పాఠశాలల్లో ఏడు, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు టీ. అవినాష్, బి. యమున, బి. జాహ్నవిలు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం పాఠశాలల్లో విద్యార్థులను అభినందించారు. ఈ విద్యార్థులు జనవరి 25 నుంచి మధ్యప్రదేశ్ కారోగోన్ జిల్లాలోని జేఎన్‌టీయూలో జరుగనున్న జాతీయస్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చల్లా పారిజాతం, పీఈటీ కే. అఖిల్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చదువుతోనే మానసిక శక్తి పెరుగుతుంది

నల్లబెల్లి, జనవరి 24 : చదువుతో మనిషి మానసిక శక్తి పెరుగుతుందని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య అన్నారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద చదువుల తల్లి సరస్వతి ఫోటోకు పూలమాల వేశారు. అనంతరం సాంబయ్య మాట్లాడుతూ.. విద్య ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో పరికి రత్నం, గుమ్మడి వేణు, రాయరాకుల సంతోష్, అడ్డగట్ల రాజు, మేకల రాజు, సురేష్‌లు పాల్గొన్నారు.

కత్తి వెంకటస్వామికి మాతృవియోగం

నర్సంపేట, జనవరి 24 : నర్సంపేట పట్టణానికి చెందిన ఓబీసీసెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి తల్లి తిరుపతమ్మ(90) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. తిరుపతమ్మ పార్థివదేహంపై సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేష్, నాయకుడు మియాపురం గోవర్ధన్, దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు గద్ద వెంకటేశ్వర్లు, కల్లెపల్లి ప్రణయదీప్, గుంటి వీరప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బత్తిని రాజేందర్, ఓర్సు తిరుపతి, బీజేపీ నాయకుడు కూమల్ల పృధ్వీరాజ్, మాజీ కౌన్సిలర్ బండి ప్రవీణ్, గౌడజనహక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్, సహాయకార్యదర్శి గోడిశాల సదానందం, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

27 నుంచి అన్నారం ఉర్సు ఉత్సవాలు

భక్తులకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



యాకూబ్‌షావలి బాబా దర్గా

పర్వతగిరి, జనవరి 24: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారంషరీఫ్ యాకూబ్‌షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు దర్గా దర్శనం కోసం తరలివస్తారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. వక్ఫ్‌బోర్డు నుంచి రూ.7.10 లక్షల నిధులు మంజూరు కావడంతో ఆ నిధులతో ప్రధానదర్గాతో పాటు మిగతా నాలుగు దర్గాలకు పెయింటింగ్ వేయిస్తున్నారు. భక్తులకు ఉచిత అన్నదానం, తాగునీరు, శానిటేషన్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. గ్రామంలోని యాకూబ్‌షావలి దర్గాతో పాటు గౌస్‌పాక్, మహబూబిమా, గుంశావలి, బోలేషావలి దర్గాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు.

మూడురోజుల పాటు ఉత్సవాలు

ప్రతీఏటా రజబ్ నెలలో ఉర్సు ఉత్సవాలను వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహిస్తారు. ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు మూడురోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు రాత్రి ఖవ్వాళి గేయాలాపన, గంధం ఊరేగింపు, రెండో రోజు రాత్రి దీపారాధన, భక్తులకు మహాఅన్నదానం, మూడోరోజు ఖత్‌మల్ ఖురానాలతో ఉత్సవాలను ముగిస్తారు. మొదటిరోజు గంధం ఊరేగింపు సందర్భంగా పలువురు ప్రముఖులు దర్గాకు వచ్చి దర్శనాలు చేసుకుంటారు. దర్గాకు ముస్లింలతో పాటు హిందువులు సైతం అధికసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడ దర్గాను దర్శించుకున్న భక్తులు గ్రామంలో విడిది చేసి కోళ్ళు, యాటలతో దేవుడికి కందూర్లు చేస్తుంటారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

ఉర్సు ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటుచేస్తున్నారు. గ్రామానికి వచ్చే మూడుదారుల్లో పార్కింగ్ స్థలాలు, చెక్‌పోస్టులు, కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో జాతర బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులకు వైద్యసేవలు అందించడానికి గాను వైద్యశిబిరాలను ఏర్పా టుచేస్తున్నారు.



దీప్తిని అభినందిస్తున్న రేవంత్‌రెడ్డి

దీప్తిని సన్మానించిన సీఎం

పర్వతగిరి, జనవరి 24: పారా ఏషియా గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన పర్వతగిరి మండలంలోని కల్లెద గ్రామానికి చెందిన అథ్లెట్ జీవంజి దీప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సన్మానించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను దీప్తితో పాటు పలువురు క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో దీప్తికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఆయన అభినందించారు. ప్రతిభ గల క్రీడాకారులందరికీ తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు ఉంటుందని, వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సౌకర్యాలు కల్పిస్తుందని సీఎం భరోసా కల్పించినట్లు దీప్తి తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి

చెన్నారావుపేట, జనవరి 24: ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలని ముదిరాజ్‌ల రాష్ట్ర నాయకుడు పులి దేవేందర్ అన్నారు. బుధవారం ముదిరాజ్ రిజర్వేషన్ల సమస్యపై హైదరాబాద్‌లోని తీన్మార్ మల్లన్నతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పులి దేవేందర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నుంచి ముదిరాజ్‌లు రిజర్వేషన్ల సమస్యతో వెనుకబడిపోతున్నామన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ల సమస్యను జీవో నెం. 15 ప్రకారం వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్న కూడా ముదిరాజ్‌లను న్యాయం జరిగే విధంగా ప్రకటన ప్రభుత్వం నుంచి వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులచే సన్మానం

చెన్నారావుపేట, జనవరి 24 : మండలంలోని సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డిని పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం కలిసి సన్మానించారు. విద్యార్థులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంతో పాఠశాలను నెలకొల్పి కార్పొరేట్ స్థాయి విద్యను అందించి ఎందరో విద్యార్థులకు మార్గదర్శనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాత శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను మోడల్‌గా తీర్చిదిద్దాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కలెక్టరేట్, జనవరి 24: జిల్లాలోని గ్రంథాలయాలను మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థల సర్వసభ్య సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 23వ ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన నిధులు, వివరాలు 2024-25 సంవత్సరం బడ్జెట్ అంచనాలు ఆమోదం పంపుటకు సంబంధిత వాటిపై సమీక్లించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 గ్రంథాలయాల్లో రెండు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. గత సంవత్సరం ఇంకా మిగిలి ఉన్న నిధులతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గ్రంథాలయాల మరమ్మతులు, సీసీ కెమెరాలు, ప్రతీ గ్రంథాలయంలో ప్రజలకు విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు ఉంచాలన్నారు. ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రంథాలయాల నిర్వహణ విషయంలో లోటుపాట్లు జరగకుండా ఉన్న నిధులను సక్రమంగా వినియోగిస్తూ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, వయోజన విద్య ఉప సంచాలకులు రమేష్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి శశిజాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

దుగ్గొండి, జనవరి 24: ఆడుకుంటూ వెళ్లిన రెండేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన ఘటన దుగ్గొండి మండలంలోని చలపర్తిలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చలపర్తి గ్రామానికి చెందిన గుండెబోయిన జగదీశ్, కీర్తన దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్దకుమార్తె గుండెబోయిన దిత్రిక(2), చిన్న కుమార్తె 3 నెలల పాప ఉన్నారు. కల్లుగీత కార్మికుడైన జగదీశ్ రోజువారీ వృత్తిలో భాగంగా బుధవారం ఉదయం కల్లు గీయడానికి తాటి వనానికి వెళ్లాడు. జగదీశ్ భార్య కీర్తన ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో పెద్ద కుమార్తె దిత్రిక ఆడుకుంటూ వెళ్లి ఇంటి అవరణలో ఉన్న నీటి సంపులో పడి మృతి చెందింది. కొంత సేపటి తరువాత చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఇంటి పరిసరాల్లో వెతకగా నీటి సంపులో చిన్నారి పడి ఉండడాన్ని గమనించింది. అప్పటికే మృతి చెంది ఉన్న దిత్రికను చూచి బోరున విలపించింది. ఈఘటనపై చిన్నారి తండ్రి జగదీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్సంపేట టౌన్, జనవరి 24 : గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన నర్సంపేట మండలం లక్నేపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్నేపల్లి గ్రామానికి చెందిన ఎంబాడి రాజు, రాధిక దంపతుల కుమారుడైన శివగణేష్(24) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొంతకాలంగా శివగణేష్ వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఏమైందో ఏమోగాని వారం క్రితం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి శివగణేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సనందించగా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం శివగణేష్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఇదిలావుండగా మృతుడు గడ్డిమందు తాగడానికి ఇదే గ్రామానికి చెందిన ఓ యువతితో ఉన్న ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

బస్సు ఢీకొని.. గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నర్సంపేట టౌన్, జనవరి 24 : బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సంపేట మండలం మహేశ్వరం శివారులో బుధవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం నర్సంపేట డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు నర్సంపేట నుంచి హన్మకొండ వెళుతోంది. ఈ క్రమంలో మహేశ్వరం గ్రామ శివారులోని తండా వైపు నుంచి నడుచుకుంటూ వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (55) రోడ్డు దాటుతున్న క్రమంలో బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కింద పడిపోయిన వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని నర్సంపేట మార్చు రీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మేడారం పనుల్లో జాప్యం చేయొద్దు

దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

మేడారం, జనవరి 24 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణంలోని షెడ్డులో బుధవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో పురోగతి కనిపించడం లేదని అహనం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనుల్లో అలసత్వం చేయొద్దన్నారు. ప్రాకాహారం, సాలహారం పెయింటింగ్, లైటింగ్ పనులతోపాటు క్యూలైన్ల మరమ్మతులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గద్దెల వద్ద గ్రిల్స్ విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి ఫిబ్రవరి 10 వరకు పూర్తి చేయాలన్నారు. అలాగే మేడారం మహా జాతర అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో అంకిత్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

జోరుగా ముందస్తు మొక్కులు

వనదేవతలు సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్షల మందికి పైగా తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులు వనదేవతలను ముందస్తుగా దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. సమ్మక్క, సారలమ్మల నామాలను స్మరించుకుంటూ గద్దెలకు చేరుకున్నారు. అలాగే సమ్మక్క, సారలమ్మలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి



'బేటీ బచావో - బేటీ పడావో' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

వరంగల్ సిటీ, జనవరి 24: బాల్యం నుంచే ఆడ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని డీఈవో డి.వాసంతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సంబంధిత పోలీసు శాఖ, విద్య, ఆరోగ్య, పంచాయతీ, క్రీడల శాఖ సౌజన్యంతో వరంగల్ మట్టెవాడలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో బుధవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసంతి మాట్లాడుతూ... బాలికా సాధికారత, వారి హక్కుల కోసం సమయానుకూలంగా ఫిర్యాదు చేసేలా బాలికలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. లింగ వివక్షపై సమాజ ధోరణి, తల్లిదండ్రుల ఆలోచన సరళి మారితేనే సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. దేశంలో బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.శారద మాట్లాడుతూ బాలికా సాధికారత, హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ బాలికల అభ్యున్నతికి జిల్లా సంక్షేమ శాఖ కృషి చేస్తుందన్నారు. అనంతరం 'బేటీ బచావో - బేటీ పడావో' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీవో కల్పన, డీవైఎస్‌వో సత్యవాణి, డీఆర్‌డీవో డీపీ ఎం.భవాని, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పావని, సీడీపీవోలు, వివిధ విభాగాల అధికారులు, పాల్గొన్నారు.

రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన వెంకటయ్య

వర్ధన్నపేట రూరల్, జనవరి 24 : మండలంలోని కట్ర్యాలకు చెందిన జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య బుధవారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపా దాసు మున్షీ, టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నగరాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

రాయపర్తి, జనవరి 24 : మండలంలోని తిర్మలాయపల్లిలో బుధవారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆటో యూనియన్ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేరుగు రంజిత్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా వశపాక కుమార్, కార్యదర్శిగా వశపాక హరీష్, సభ్యులు చెలోజు నాగయ్య, ఆడెపు నర్సింహులు, వశపాక కొమురయ్య, బరిగెల యాకయ్య, ముద్రబోయిన వెంకన్న తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మిథిన్

వర్ధన్నపేట, జనవరి 24: దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వర్ధన్నపేట పట్టణంలోని 10 వార్డుకు చెందిన చల్లా మిథిన్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యావంతుడు, ఉద్యమాలపై అవగాహన ఉన్న వ్యక్తి కావడంతో పదవిని ఆయనకు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యలు పోరాటం చేస్తానని మిథిన్ ఈ సందర్భంగా తెలిపారు.

జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికైన గ్రామాలు

నల్లబెల్లి, జనవరి 24: ఇటీవల రిపోర్ట్ ప్రకారం వరంగల్ జిల్లాలో బాల్య వివాహాలు లేని 13 గ్రామాలు ఎంపికయ్యాయని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా మండలంలోని రాంపూర్, కొండాపురం గ్రామాలు బాల్య వివాహాలు లేని గ్రామాలుగా ఎంపిక కావడం జరిగిందన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని పద్మశాలి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ చింతపట్ల సురేష్, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌లకు, అలాగే కొండాపురం సర్పంచ్ గూబ తిరుపతమ్మరాజు, పంచాయతీ కార్యదర్శి రజితలకు ఈ జిల్లా స్థాయి అవార్డులను డీడబ్ల్యూవో శారద, డీఈవో వాసంతి, డీపీవో కల్పనలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రాజెక్ట్ పనులను తర్వగా పూర్తి చేయండి

అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్

చెన్నారావుపేట, జనవరి 24: ప్రాజెక్ట్ పనులు సకాలంలో పూర్తి చేసినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆశాజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో సమైక్య అధ్యక్షురాలు షైమా అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. డెవలప్‌మెంట్ పనులను క్రమశిక్షణతో పూర్తి చేయాలన్నారు. లేదంటే ప్రాజెక్ట్ పరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీబీవో ఆడిటర్ వెంకట్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

• డీఆర్‌డీఏ జిల్లా అదనపు అధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ జిల్లా అదనపు అధికారి శ్రీనివాస్

వర్ధన్నపేట, జనవరి 24: మహిళలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలతో సుస్థిర జీవనోపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థిక, సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టేందుకు గ్రామ సంఘాల సహాయకులు కృషి చేయాలని డీఆర్‌డీఏ, సెర్ప్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో వీవోల క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెర్ప్ కార్యక్రమాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్ది వర్ధన్నపేట మండలం దేశంలోనే ప్రథమస్థానం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వీవోఏలు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు మునిగాల దయాకర్, అనిత, ఏటీఎంలు వీర్ల వేణు, పులుసు అశోక్, సీసీలు గోలి కొమురయ్య, స్వామి, రమేశ్, వివిధ గ్రామాల వీవోఏలు తక్కళ్లపల్లి పద్మావతి, ఆకుల స్రవంతి, రమ్య, రమ, శోభ, బిర్రు దయాకర్, కొండేటి సుమన్, రోజా, సుభద్ర, లెక్కల జ్యోతి, సుజాత, మంజుల, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నర్సంపేట టౌన్, జనవరి 24 : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ బాలికల రక్షణ, అభివృద్ధి కోసం సమాజంలోని ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. అనంతరం బాలికలచే ఆడపిల్లల రక్షణ గురించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రమ విద్యార్థులకు సన్మానం

జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభను చాటిన నర్సంపేటలోని మాతృభూమి సంజీవని అనాథ ఆశ్రమ విద్యార్థులను జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని కొత్తవాడ పద్మశాలి గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో వాసంతి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి శారద ఆధ్వర్యంలో విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎ. మోహన్‌రావును అధికారులు అభినందించారు.